సాక్షి
సూర్యాపేట

బుధవారం। 1 । మే । 2024



నేటి నుంచి టెన్నిస్ పోటీలు
భువనగిరిలో బుధవారం నుంచి 4వ తేదీ వరకు జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలు నిర్వహించనున్నారు. - IIలో



ముగిసిన ఎడ్ల పందేలు
మఠంపల్లిలో నిర్వహిస్తున్న రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్ల పందేలు మంగళవారం ముగిశాయి. - IIలో

గరిష్టం / కనిష్టం
43° / 29°
వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

జిల్లా ప్రధాన జడ్జిగా గోవర్ధన్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ



చివ్వెంల: సూర్యాపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా ఎస్.గోవర్ధన్‌రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. తెలంగాణ రాష్ట్ర లీగల్‌సెల్ అథారిటీ సెక్రటరీగా పనిచేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన జి.రాజగోపాల్ బదిలీపై ఖమ్మం జిల్లాకు వెళ్లారు. ఈ సందర్భంగా సీనియర్, జూనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

2 నుంచి కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం

హుజూర్‌నగర్: కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో ఈనె 2 నుంచి 4వ తేదీ వరకు నిర్వహించనున్న ఎన్నికల ప్రచారం కాంగ్రెస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి పాల్గొంటారని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2న మోతె, నడిగూడెం, మునగాల, కోదాడ, అనంతగిరి మండలాల్లో ప్రచారం, కోదాడలో పాదయాత్ర ఉంటుందని పేర్కొన్నారు. 3న చిలుకూరు, చింతలపాలెం, మేళ్లచెరువు, హుజూర్‌నగర్ మండలాల్లో ఎన్నికల ప్రచారం, హుజూర్‌నగర్‌లో పాదయాత్ర ఉంటుందని తెలిపారు. 4న మఠంపల్లి, గరిడేపల్లి, పాలకవీడు, నేరేడుచర్ల మండలాలు, పట్టణంలో ప్రచారం, సమావేశం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఈ ప్రచారంలో కోదాడ ఎమ్మెల్యే పద్మావతి కూడా పాల్గొంటారని తెలిపారు.

బీజేపీని ఓడించాలి



నేలమర్రిలో మాట్లాడుతున్న కోట రమేష్

మునగాల(కోదాడ): ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని వాగ్దానం చేసి కేంద్రంలో అధికారంలోకి వచ్చి యువతను మోసం చేసిన బీజేపీని లోక్‌సభ ఎన్నికల్లో ఓడించాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డీవైఎఫ్ఐ) రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని నేలమర్రిలో డీవైఎఫ్ఐ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ ఇస్తానన్న రెండు కోట్ల ఉద్యోగాలు ఎక్కడ? అని యువత ప్రశ్నిస్తే పకోడీలు అమ్ముకోవడం కూడా ఉద్యోగం లాంటిదేనని, దేశ యువతను అవమానించేలా మాట్లాడారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగం, ప్రజాసామ్య హక్కుల పరిరక్షణకు బీజేపీని ఓడించాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. ఈ సమావేశంలో డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు బచ్చలకూర సురేందర్, బచ్చలకూర సికేందర్, సోంపంగు సూర్యతేజ, గోపి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మట్టపల్లిలో సుదర్శన హోమం



హోమం నిర్వహిస్తున్న రుత్విక్కులు

మఠంపల్లి: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో హైదరాబాద్‌కు చెందిన యాజ్ఞికులు సుధీర్‌శర్మ బృందం ఆధ్వర్యంలో మంగళవారం శ్రీసుదర్శననారసింహ సమిత విష్ణుపంచాయతన హోమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుధీర్‌శర్మ మాట్లాడుతూ లోకకల్యాణార్థమే ఈనెల 10 వరకు ఈ హోమం నిర్వహించనున్నట్టు తెలిపారు. అలాగే క్షేత్రంలో నిత్యపూజలు, కల్యాణం జరిపించారు. క్షేత్రపాలకుడైన శ్రీఆంజనేయస్వామికి తమలపాకులతో ప్రత్యేక అర్చనలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్ దంపతులు, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు, రుత్విక్కులు, భక్తులు పాల్గొన్నారు.

96.91 శాతం ఉత్తీర్ణత

పదో తరగతిలో సత్తాచాటిన విద్యార్థులు

- బాలురు 96.16 శాతం
- బాలికలు 97.72 శాతం ఉత్తీర్ణత
- గతేడాది కంటే మెరుగైన ఫలితాలు
- రాష్ట్ర స్థాయిలో జిల్లాకు 6వ స్థానం



పదో తరగతిలో 10జీపీఏ సాధించిన జిల్లా కేంద్రంలోని జీజేఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని హారికను అభినందిస్తున్న కలెక్టర్ వెంకటరావు, చిత్రంలో డీఈఓ అశోక్ తదితరులు

సూర్యాపేట టౌన్: పదో తరగతి వార్షిక పరీక్ష ఫలితాల్లో జిల్లా విద్యార్థులు రికార్డు స్థాయిలో ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 347 పాఠశాలల్లో 11,910 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 11,542 మంది విద్యార్థులు పాసై 96.91 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇందులో బాలురు 6,198 మందికి 5,960 మంది పాసై 96.16శాతం ఉత్తీర్ణత సాధించారు. బాలికలు 5,712 మందికి 5,582 మంది పాసై 97.72శాతంతో బాలుర కంటే పైచేయి సాధించారు. దీంతో జిల్లాలో గత ఏడాది కంటే అధికంగా ఉత్తీర్ణత నమోదైంది. గత ఏడాది జిల్లా 89.93శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో 15వ స్థానానికి పరిమితం కాగా ఈ ఏడాది ఫలితాల్లో 96.91శాతం ఉత్తీర్ణత సాధించి 6వ స్థానంలో నిలిచింది.

సత్తాచాటిన ప్రభుత్వ విద్యార్థులు

జిల్లాలో పలు ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారు. మూడు ఎయిడెడ్ పాఠశాలల్లో 111 మందికి 109 మంది పాసై 98.20 శాతం ఉత్తీర్ణత సాధించారు. రెండు ఆశ్రమ పాఠశాలల్లో 94.81శాతం, ఎనిమిది బీసీ వెల్ఫేర్ పాఠశాలల్లో 99.65శాతం ఉత్తీర్ణత, ఏడు ప్రభుత్వ పాఠశాలల్లో 90.28శాతం ఉత్తీర్ణత సాధించారు. అలాగే 18 కేజీబీవీల్లో 95.28శాతం, తొమ్మిది మోడల్ స్కూళ్లలో 94.98శాతం, ఒక రెసిడెన్షియల్ పాఠశాలలో 66 మంది విద్యార్థులకు 66 మంది పాసై 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. నాలుగు మినీ రెసిడెన్షియల్ గురుకులాల్లో 100శాతం ఉత్తీర్ణత, ఎనిమిది సోషల్ వెల్ఫేర్ పాఠశాలల్లో 99.51శాతం, రెండు ట్రైబల్ వెల్ఫేర్ 97.02శాతం, 168 జెడ్పీ పాఠశాలల్లో 94.50శాతం ఉత్తీర్ణత సాధించారు.

45 మంది విద్యార్థులకు 10జీపీఏ

ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులు ఈ ఏడాది అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. అన్ని పాఠశాలల్లో 90శాతానికిపైగా ఉత్తీర్ణత సాధించారు. జిల్లాలో ఐదు ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఐదురుగు విద్యార్థులు 10జీపీఏ సాధించి సత్తాచాటారు. అలాగే గురుకులాల్లో చదివే 34 మంది విద్యార్థులు 10జీపీఏ సాధించారు. మోడల్ స్కూళ్లకు చెందిన ఆరుగురితో కలిపి మొత్తం 45 మంది ప్రభుత్వ విద్యార్థులు 10జీపీఏ సాధించారు.

196 పాఠశాలల్లో 100శాతం ఉత్తీర్ణత

జిల్లాలో 196 పాఠశాలలు 100శాతం ఉత్తీర్ణత సాధించాయి. ఒక ఎయిడెడ్ పాఠశాల, ఆశ్రమ పాఠశాల ఒకటి, బీసీ వెల్ఫేర్ పాఠశాలలు ఆరు, కస్తూరిబా విద్యాలయాలు ఏడు, మోడల్ స్కూళ్లు మూడు, ప్రైవేట్ పాఠశాలలు 87, రెసిడెన్షియల్ ఒకటి, నాలుగు మినీ రెసిడెన్షియల్ పాఠశాలలు, సోషల్ వెల్ఫేర్ ఆరు పాఠశాలలు, జెడ్పీ పాఠశాలలు 80 స్కూళ్లు 100శాతం ఉత్తీర్ణత సాధించాయి.

ఫెయిలైన విద్యార్థులు అధైర్యపడొద్దు

ఈ ఏడాది పదో తరగతి వార్షిక పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించడం పట్ల చాలా ఆనందంగా ఉంది. ఇదే ఒరవడిని మున్ముందు కొనసాగిస్తాం. పరీక్షల్లో ఒకటి, రెండు సబ్జెక్టులు ఫెయిలైన విద్యార్థులు అధైర్య పడొద్దు. వచ్చే నెలలో జరగబోయే అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షలకు మళ్లీ ప్రిపేర్ అయ్యి సత్తాచాటాలి. జూన్ 3వ తేదీ నుంచి 13వ తేదీ వరకు సప్లిమెంటరీ పరీక్షలు ఉంటాయి. విద్యార్థులు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఈ నెల 16వ తేదీలోగా పరీక్ష ఫీజు సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు చెల్లించుకోవచ్చు. రూ.50 అపరాధ రుసుంతో ప్రతి పరీక్షకు రెండు రోజుల ముందు వరకు కూడా ఫీజు చెల్లించవచ్చు. ఒక్కో సబ్జెక్టుకు 15 రోజుల్లోగా రూ.500 రుసుం చెల్లించి రీకౌంటింగ్ కూడా పెట్టించుకోవచ్చు.

– అశోక్, డీఈఓ, సూర్యాపేట

విద్యార్థులకు శుభాభినందనలు

- కలెక్టర్ వెంకటరావు

సూర్యాపేట టౌన్: పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటరావు శుభాభినందనలు తెలిపారు. మంగళవారం సూర్యాపేటలోని కలెక్టరేట్‌లో జిల్లా కేంద్రంలోని జీజేఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని హారిక 10జీపీఏ సాధించడంతో ఆమెను అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని పాఠశాలలు, వసతి గృహాల్లో ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు మెరుగైన వసతులు కల్పించడం వల్లే ఉత్తమ ఫలితాలు సాధించగలిగామన్నారు. ఇందుకు డీఈఓ, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, ఇతర అధికారులు చేసిన కృషి ప్రశంసనీయమన్నారు. 96.91శాతం ఉత్తీర్ణతతో జిల్లాను రాష్ట్రంలో 6వ స్థానంలో నిలిపినందుకు హృదయపూర్వకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ అశోక్‌తో పాటు ఎంఈఓలు, సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జానారెడ్డి, చిత్రంలో రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, తీన్మార్ మల్లన్న, పటేల్ రమేష్‌రెడ్డి, సర్వోత్తమ్‌రెడ్డి, అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి తదితరులు

కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి

- రఘువీర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలి
- మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి

ఆత్మకూర్(ఎస్): ఉమ్మడి రాష్ట్రంలోనైనా, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంలోనైనా కాంగ్రెస్ హయాంలో జరిగే అభివృద్ధే గ్రామాల్లో కనిపిస్తుందని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి అన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆత్మకూర్(ఎస్) మండలం నెమ్మికల్లులో జరిగిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం తేవడంతోపాటు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి పేదల జీవితాల్లో వెలుగును నింపిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. మాయమాటలు చెప్పి మధ్యలో అధికారంలోకి వచ్చిన తోక పార్టీలు కాలగర్భంలో గల్లంతు అవుతూనే ఉన్నాయన్నారు. కాంగ్రెస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థిగా తన కుమారుడు రఘువీర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించి ఢిల్లీలో పార్లమెంట్‌కు పంపాలని పిలుపునిచ్చారు. మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ సూర్యాపేట నియోజకవర్గంలో సూర్యాపేట నియోజకవర్గంలో 40 వేల ఓట్ల మెజార్టీ రఘువీర్‌రెడ్డికి ఇస్తామని హామీ ఇచ్చారు. అభ్యర్థి రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ పేదలకు అండగా ఉండే కాంగ్రెస్‌ను గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. ప్రముఖ జర్నలిస్టు, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ భారతదేశంలో లేకుంటే భారతీయులు బానిసలుగా ఉండేవారన్నారు. అధికారం కోసం ప్రజలకు మాయమాటలు చెబుతూ మరోసారి మోసం చేసేందుకు వస్తున్న బీజేపీని నమ్మొద్దన్నారు. రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వేదాసు వెంకయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ గెలుపు దేశానికి చాలా అవసరమన్నారు. ఈ సందర్భంగా కందగట్ల మంగలి తండాకు చెందిన పలువురు నాయకులు బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, కొప్పుల వేణారెడ్డి, సూర్యాపేట, నల్లగొండ డీసీసీ అధ్యక్షులు చెవిటి వెంకన్న యాదవ్, శంకర్‌నాయక్, జిల్లా నాయకుడు పోతు భాస్కర్, పార్టీ మండల అధ్యక్షుడు కందాల వెంకట్‌రెడ్డి, నాయకులు కాకి కృపాకర్‌రెడ్డి, పెద్దిరెడ్డి రాజా, గోదల రంగారెడ్డి, సామ మల్లారెడ్డి, రాజేష్‌నాయక్, పచ్చిపాల వెంకన్న, శనగాని రాంబాబు, బైరు దుర్గయ్య, అనురాధ, పాండునాయక్, శిగ శ్రీనివాస్, రాజు, బీరెల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎల్లాచారి, రాంరెడ్డి, సత్యం, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చూస్తాం

- కలెక్టర్ వెంకటరావు



వాటర్ ట్యాంకును పరిశీలిస్తున్న కలెక్టర్

దురాజ్‌పల్లి (సూర్యాపేట): సూర్యాపేట పట్టణంలో తాగునీటి ఎద్దడి రాకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటరావు అన్నారు. మంగళవారం సూర్యాపేటలోని బతుకమ్మ చౌరస్తా వద్ద గల ఫిల్టర్ బెడ్, వాటర్ ట్యాంకును పరిశీలించి మాట్లాడారు. ఈ నెలలో స్పెషల్ సమ్మర్ యాక్షన్ ప్లాన్ ప్రకారం నీటి లభ్యత, డిమాండ్ ప్రకారం తాగునీరు అందించాలని, నీటిని పొదుపుగా వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. పులిచింతల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో లోలెవల్‌కి నీరు చేరడంతో హుజూర్‌నగర్ పరిధిలో మట్టపల్లి, కృష్ణాపురం ప్రాంతాల్లో నీటి ఎద్దడి తలెత్తనున్నందున వ్యవసాయ బావులు, బోరు బావులు నీటిని వినియోగంలోకి తేవాలన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో 90 ఆవాసాల్లో నీటి సరఫరాపై మిషన్ భగీరథ ఇంజనీర్లతో చర్చించారు. అనంతరం పాత వ్యవసాయ మార్కెట్ వద్ద గల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం కార్యాలయంలో గల 84, 85 పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపులు, లైటింగ్, ఇతర వసతులను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్, మిషన్ భగీరథ ఈఈ అరుణాకర్‌రెడ్డి, డీఈ రాజేందర్, ఏఈ వరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

38 మందికి షోకాజ్ నోటీసులు

ఎన్నికల శిక్షణ తరగతులకు హాజరుకాని సిబ్బందిపై చర్యలు తప్పవని కలెక్టర్ ఎస్.వెంకటరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6న నిర్వహించిన ఎన్నికల శిక్షణకు హాజరుకాని 38 మంది ఓపీఓలకు షోకాజ్ నోటీసులు అందించామని, మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో వారి వివరణ తీసుకున్నామని కొంతమంది విధులకు హాజరు అవుతామని తెలిపారని పేర్కొన్నారు. విధులకు హాజరుకాని వారి వివరాలు ఎలక్షన్ కమిషన్‌కు పంపి సెక్షన్ 28 ప్రకారం వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ధాన్యం కొనుగోళ్ల పరిశీలన

సూర్యాపేట: మండల పరిధిలోని ఎర్కారం గ్రామంలో పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ వెంకటరావు పరిశీలించారు. కేంద్రం ఇన్‌చార్జి వెంకట్‌రెడ్డిని అడిగి ధాన్యం కొనుగోళ్ల వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట ఆర్డీఓ సురేష్‌రెడ్డి, మేనేజర్ వెంకట్‌రెడ్డి ఉన్నారు.

రఘువీర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి

- రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య



సమావేశంలో మాట్లాడుతున్న వీరయ్య

కోదాడ రూరల్: కాంగ్రెస్ పార్టీ నల్లగొండ ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుందామని రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య అన్నారు. విజయ సంకల్ప యాత్రలో భాగంగా మంగళవారం కోదాడ పట్టణానికి వచ్చిన సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే ఇచ్చిన గ్యారంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందన్నారు. కాంగ్రెస్ పాలనపై బీజేపీ, బీఆర్‌ఎస్‌లు అబద్ధపు ప్రచారాలకు తెరలేపారని, వీటిని తిప్పికొట్టాలన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 12కు పైగా స్థానాల్లో విజయం సాధించబోతుందని ధీమా వ్యక్తం చేశారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో రూ.లక్షల కోట్ల అప్పులు చేసి తెలంగాణ ప్రజలపై తీరని భారాన్ని మోపిందని ఆరోపించారు. లిక్కర్ స్కాంలో కేసీఆర్ కూతురు కవిత అరెస్ట్ అయిందని, మరికొద్ది రోజుల్లో ఫోన్ ట్యాపింగ్, డ్రగ్స్ కేసులో కేటీఆర్ కూడా అరెస్ట్ కావడం ఖాయమన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు, మాజీ ఎంపీపీ బొలిశెట్టి నాగేంద్రబాబు, ముత్తినేని కోటేశ్వరరావు, దొంగరి వెంకటేశ్వర్లు, మల్లికార్జునరావు, కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, బచ్చు అశోక్, సుశీలరాజు, అనురాధ, బుడిగం నరేష్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత జీవనంతోనే సంపూర్ణ ఆరోగ్యం

కోదాడ రూరల్: రిటైర్‌మెంట్ తర్వాత ప్రశాంత జీవనం గడపడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండొచ్చని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతారామయ్య అన్నారు. మంగళవారం కోదాడ పట్టణంలోని పెన్షనర్స్ భవన్‌లో పలువురి రిటైర్డ్ ఉద్యోగుల సామూహిక జన్మదిన వేడుకలో మాట్లాడారు. కార్యక్రమంలో కోదాడ యూనియన్ అధ్యక్షుడు వేనేపల్లి శ్రీనివాసరావు, అసోసియేట్ అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వరరావు, జగన్‌మోహన్‌రావు, హనుమారెడ్డి, అమృతారెడ్డి, విద్యాసాగర్, వరప్రసాద్‌రావు, భ్రమరాంబ, శోభ, రఘువరప్రసాద్, నరసయ్య తదితరులు ఉన్నారు.

నిప్పుల కుంపటి!

- మునగాలలో అత్యధికంగా 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- వడగాల్పులతో బెంబేలెత్తుతున్న జనం

భానుపురి (సూర్యాపేట): జిల్లా వ్యాప్తంగా సూర్యుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. గతంలో ఎన్నడూలేని విధంగా జిల్లాలో 45 డిగ్రీలకుపైగా పగటి ఉష్ణోగ్రత నమోదు అవుతుండడంతో నిప్పుల కుంపటిగా మారింది. ఇప్పటివరకు 44.7 డిగ్రీల ఉష్ణోగ్రత జిల్లాలో అత్యధికంగా నమోదయింది. ఈ ఎండాకాలం సీజన్‌లో తొలిసారిగా మంగళవారం 45 డిగ్రీల రికార్డు స్థాయి ఉష్ణోగ్రత మునగాల మండలంలో నమోదైంది. నూతనకల్ మండలంలో 44.8, ఇంకా పలు మండలాల్లో 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ప్రధానంగా ఎండ తీవ్రతతో పాటు వడగాల్పులు వీస్తుండడంతో జనం ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇక సూర్యాపేట పట్టణంతో పాటు కోదాడ, హుజూర్‌నగర్, తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రాల్లో రహదారుల వెంట తోపుడుబండ్లపై వ్యాపారాలు చేసుకునే చిరు వ్యాపారులు ఎండ తాకిడికి అల్లాడిపోతూ ఉన్నారు.

మంగళవారం పలు మండలాల్లో నమోదైన అత్యధిక ఉష్ణోగ్రతలు (°C)

మండలం	గరిష్టం
మునగాల	45
నూతనకల్	44.8
మద్దిరాల	44.5
మోతె	44.5
కోదాడ	44.2
మేళ్లచెరువు	44.0
సూర్యాపేట	44.0
చిలుకూరు	43.9
చింతలపాలెం	43.8
హుజూర్‌నగర్	43.7

'ఉపాధి' టీఏలకు వేతన వెతలు

- మూడు నెలలుగా అందని జీతాలు
- 71 మంది టెక్నికల్ అసిస్టెంట్లకు తప్పని ఎదురుచూపులు
- కుటుంబాలు గడవడం కష్టంగా మారిందని ఆవేదన
- వెంటనే చెల్లించాలని వేడుకోలు



మునగాల మండలం తిమ్మారెడ్డిగూడెంలో కూలీలతో మాట్లాడుతున్న టీఏ శేఖర్‌రావు(ఫైల్)

అర్వపల్లి: పల్లెల్లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు పనులు కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తున్న టెక్నికల్ అసిస్టెంట్లకు వేతన వెతలు తప్పడంలేదు. వీరికి మూడు నెలలుగా వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే చాలీచాలని జీతాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. దీనికి తోడు నెల నెలా వేతనాలు రాక మరింత క్లిష్ట పరిస్థితులెదుర్కొంటున్నారు.

జిల్లాలో 71మంది టీఏలు

ఉపాధి హామీ పథకంలో జిల్లా వ్యాప్తంగా 71మంది టెక్నికల్ అసిస్టెంట్లు(టీఏలు) పనిచేస్తున్నారు. పల్లెల్లో ఉపాధి పనులను గుర్తించడం.. పని ప్రదేశాలకు వెళ్లి కొలతలు తీసుకోవడం వీరి విధి. అలాగే కొలతల ప్రకారం పనులను మేట్లకు అప్పగించడం.. మేట్లు ఇచ్చిన కొలతలను ప్రతి వారం తనిఖీ చేయాల్సి ఉంటుంది. అలాగే చెక్ మేజర్‌మెంట్‌ను జూనియర్ ఇంజనీర్‌కు సమర్పించాలి. వారం చివరలో పనుల కొలతలను మస్టర్లలో నమోదు చేయాలి. ఎంబీ రికార్డు చేసి ఈసీకి సమర్పించాల్సి ఉంటుంది. ఇలా ఉపాధి పనుల నిర్వహణలో ఎంతో బాధ్యతాయుతంగా పనిచేస్తున్న వీరికి మూడు నెలలుగా వేతనాలు రావడంలేదు. కొన్ని మండలాల్లో కొంతమంది టెక్నికల్ అసిస్టెంట్లకు నాలుగు నెలల జీతాలు రావాల్సి ఉంది. అలాగే అలవెన్సులు కూడా కొన్నేళ్లుగా పెంచడం లేదు. పెరిగిన నిత్యావసరాలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని కోరుతున్నారు.

వేతనాలను విడుదల చేయాలి



పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలను వెంటనే విడుదల చేయాలి. నెలనెలా జీతాలు రాక ఇబ్బంది పడుతున్నాం. గతంలో రెండు మూడు గ్రామాల్లోనే విధులు నిర్వహించేవాళ్లం. ప్రస్తుతం ఆరు నుంచి పది గ్రామాల్లో డ్యూటీ చేయాల్సి వస్తోంది.

– రాంపంగు మల్సూరు, ఉపాధి హామీ టీఏల సంఘం జిల్లా అధ్యక్షుడు

అలవెన్సులు పెంచడం లేదు



ఉపాధి హామీ పథకంలో పనిచేసే టెక్నికల్ అసిస్టెంట్లకు 18 ఏళ్లుగా అలవెన్సులు పెంచడం లేదు. దీంతో చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నాం. సకాలంలో వేతనాలు చెల్లించి అలవెన్సులను పెంచాలి. పేస్కేలు కూడా అమలు చేయాలి.

– చకిలం శేఖర్‌రావు, టీఏల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు

కాంగ్రెస్, బీజేపీ తోడుదొంగలు

- మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి



సూర్యాపేటలో ప్రచారం చేస్తున్న జగదీష్‌రెడ్డి తదితరులు

సూర్యాపేట: కాంగ్రెస్, బీజేపీలు తోడుదొంగలని, ఆ పార్టీల సిద్ధాంతాలు ఒక్కొక్కటిగా బహిర్గతం అవుతున్నాయని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా మంగళవారం సూర్యాపేట మండలం సోలిపేట, మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో బీఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి గడపగడపకూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో మళ్లీ కేసీఆర్ హవా మొదలైందని.. కేసీఆర్ వస్తేనే తమకు శ్రీరామ రక్ష అని ప్రజలే అంటున్నారని పేర్కొన్నారు. తెలంగాణలో 16 ఎంపీ స్థానాలను బీఆర్‌ఎస్ కైవసం చేసుకోనుందని రాజకీయ పరిశీలకులు అంటున్నారన్నారు. లోక్‌సభ ఎన్నికల తరువాత రాష్ట్ర పరిస్థితుల్లో మార్పు తథ్యం అన్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు పలువురు ఉన్నారు.

ధాన్యం కాంటాలు వేగవంతం చేయాలి

- అదనపు కలెక్టర్ బీఎస్.లత



కుంటపల్లి చెక్ పోస్టు వద్ద రిజిస్టర్‌ను తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ బీఎస్.లత

మద్దిరాల: ధాన్యం కాంటాలు వేగవంతం చేసి బస్తాలను వెంటనే మిల్లులకు తరలించాలని అదనపు కలెక్టర్ బీఎస్.లత ఆదేశించారు. మంగళవారం మద్దిరాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. అనంతరం స్థానికంగా ఉన్న పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. కుంటపల్లి వద్ద చెక్‌పోస్టును తనిఖీ చేశారు. ఆ సమయంలో చెక్‌పోస్టు వద్ద విధి నిర్వహణలో సరిపడా సిబ్బంది లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. చెక్‌పోస్టు వద్ద పకడ్బందీగా విధులు నిర్వహించాలన్నారు. ఆమె వెంట తహసీల్దార్ అమీన్‌సింగ్, ఏఓ వికాస్ పాటిల్, ఎఫ్ఎస్‌టీ సిబ్బంది ఉన్నారు.

ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలి

మర్రిగూడ: చెక్‌పోస్టుల వద్ద ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల జనరల్ అబ్జర్వర్ రాబర్ట్‌సింగ్ క్షత్రియ అన్నారు. మంగళవారం మర్రిగూడ మండలంలోని తిరగండ్లపల్లి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం యరగండ్లపల్లి హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను సందర్శించారు. ఓటర్లకు మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. ఆయన వెంట చండూరు ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, మర్రిగూడ తహసీల్దార్ బక్క శ్రీనివాసులు, ఎంపీడీఓ జి. చినమునయ్య, పీఆర్ ఏఈ యశ్వంత్, ఎస్ఐ కె. రంగారెడ్డి, సూపరింటెండెంట్ యాకుబ్ తదితరులు పాల్గొన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న ఎన్నికల జనరల్ అబ్జర్వర్ రాబర్ట్‌సింగ్ క్షత్రియ

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు


రాజేష్ చంద్ర, డీసీపీ

భువనగిరి క్రైం: ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని భువనగిరి డీసీపీ రాజేష్ చంద్ర అన్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా రూ.7,76,000, 32.85లీటర్ల మద్యం, 20 మందిని బైండోవర్ చేసినట్లు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.50వేలకు పైగా డబ్బు తీసుకెళ్లినా, అక్రమంగా మద్యం తరలించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

దేశాభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

- మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి


మాట్లాడుతున్న కుందూరు జానారెడ్డి

చివ్వెంల(సూర్యాపేట): కాంగ్రెస్ పార్టీతోనే దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి అన్నారు. కాంగ్రెస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి గెలుపును కాంక్షిస్తూ మంగళవారం చివ్వెంల మండల కేంద్రంలోని వెంకట్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి ఎంతో ఘన చరిత్ర ఉందని అన్నారు. స్వాతంత్ర్యం తెచ్చింది, తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీనేనని అన్నారు. రాష్ట్రంలో ఆరు గ్యారంటీలను పకడ్బందీగా అమలు చేస్తామని, గ్యారంటీల అమలులో ప్రజలను భాగస్వాములను చేస్తామన్నారు. ఇందిరమ్మ కమిటీలను నియమించి, అందులోని ప్రతి సభ్యుడికి రూ.6వేలు అందజేస్తామన్నారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేయాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. అనంతరం ఎంపీ అభ్యర్థి కుందూరి రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ.. తనను ఎంపీగా గెలిపిస్తే చివ్వెంల మండలంలోని సమస్యలు పరిష్కారిస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ.. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. రఘువీర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా చివ్వెంలం మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల ప్రజలు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి, ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధరావతు వీరన్ననాయక్, మాజీ జెడ్పీటీసీ చింతమల్ల రమేష్, వేములపల్లి వాసుదేవరావు, పెద్దిరెడ్డి రాజా, అమరారావు శ్రీనివాస్, ఎండీ జాఫర్, నాగునాయక్, నర్సిరెడ్డి, సమీర్ ఖాన్, మధుకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అప్పగించిన పనిని పక్కాగా నిర్వహించాలి

- కర్నాటక రాష్ట్ర ఐటీ సెల్ కన్వీనర్ వికాస్‌జీ


సమావేశంలో మాట్లాడుతున్న వికాస్‌జీ

చౌటుప్పల్: అప్పగించిన పనిని ఏమాత్రం నిర్లక్ష్యం లేకుండా పక్కాగా నిర్వహించాలని కర్నాటక రాష్ట్ర బీజేపీ ఐటీ సెల్ కన్వీనర్ వికాస్‌జీ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మునుగోడు అసెంబ్లీ నియోజవర్గానికి ఆయన ఇన్‌చార్జ్ వచ్చిన సందర్భంగా మంగళవారం పట్టణంలో నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. ప్రతి కార్యకర్తల తమతమ బూత్‌లలో పని చేసుకోవాలన్నారు. ప్రతి ఓటరును కలుసుకోవాల్సిందేనని సూచించారు. బీజేపీకి ఎందుకు ఓటు వేయాలి అనే విషయాన్ని ఓటర్లకు స్పష్టంగా వివరించాలన్నారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటర్లు కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ దూడల భిక్షంగౌడ్, బీజేపీ నల్లగొండ అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, పార్లమెంట్ కో–కన్వీనర్ నారాయణయాదవ్, రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనూరి వీరారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రమనగోని శంకర్, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ పోలోజు శ్రీధర్‌బాబు, బీజేపీ మున్సిపల్ అధ్యక్షులు కంచర్ల గోవర్ధన్‌రెడ్డి, చినుకని మల్లేశం, నాయకులు గుజ్జుల సురేందర్‌రెడ్డి, దాసోజు భిక్షమాచారి తదితరులు పాల్గొన్నారు.

మరో ఇరవై ఏళ్లు కాంగ్రెస్‌దే అధికారం

- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు: తెలంగాణలో మరో ఇరవై ఏళ్లు కాంగ్రెస్ పార్టీనే అధికారంలో కొనసాగుతుందని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మునుగోడు పట్టణానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మంగళవారం మునుగోడులోని కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఆయన సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. పదేళ్ల పాటు అధికారంలో కొనసాగిన బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక అవినీతి, అక్రమాలకు పాల్పడిందన్నారు. అందుకే రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కర్నాటి స్వామి, పాల్వాయి జూనియర్ గోవర్ధన్‌రెడ్డి, మిర్యాల వెంకన్న, పాల్వాయి చెన్నారెడ్డి, సాగర్ల లింగస్వామి, పందుల శ్రీను, పోలే రాజు, జిట్టగోని నరేష్ పాల్గొన్నారు.


చిట్యాల: మాట్లాడుతున్న రాజగోపాల్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్యే వీరేశం, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

చామలకు ఓటు వేస్తే నాకు వేసినట్లే..

చండూరు: కాంగ్రెస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి ఓటు వేస్తే తనకు వేసినట్లేనని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. చండూరులో మంగళవారం నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని కోరారు. ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ తప్ప మిగిలిన ఏ పార్టీలకు ఓటు వేసినా అది బీజేపీకి వేసినట్లేనని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పున్న కైలాస్‌నేత, చండూరు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దోటి సుజాత, మండల పార్టీ అధ్యక్షుడు కొరిమి ఓంకారం, పట్టణ అధ్యక్షుడు అనంత చంద్రశేఖర్, సీపీఐ మండల కార్యదర్శి నలపరాజు సతీష్, గట్టుప్పల కాంగ్రెస్ అధ్యక్షుడు నామని జగన్నాథం, ఎంపీటీసీ పల్లె వెంకన్న, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్‌లను ఓడించాలి

చిట్యాల: చిట్యాలలో మంగళవారం రాత్రి నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో కలసి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కులం, మతం పేరుతో రెచ్చగొడుతూ ఎన్నికల్లో పోటీ చేస్తున్న బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ చచ్చిపోయిందని, ఆ పార్టీ ఇక మీదట ఏ ఎన్నికల్లో గెలువదని అన్నారు. చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు దుబ్బాక నర్సింహారెడ్డి, దైద రవీందర్, గుత్తా అమిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జడల చినమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అవినీతిలేని పాలన అందించిన ఘనత నరేంద్ర మోదీదే

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు


మాట్లాడుతున్న సంకినేని వెంకటేశ్వర్‌రావు, చిత్రంలో ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్

అర్వపల్లి: దేశంలో గత పదేళ్లుగా అవినీతిలేని పాలన అందించిన ఘనత ప్రధాని మోదీదేనని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు అన్నారు. భువనగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌తో కలిసి ఆయన మంగళవారం అర్వపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలపై కాంగ్రెస్ నాయకులను ఓటర్లు నిలదీయాలని కోరారు. బీజేపీ ప్రభుత్వ హయాంలోనే ఈ ప్రాంతంలో రెండు జాతీయ రహదారుల నిర్మాణం జరిగిందని అన్నారు. గతంలో ఎంపీగా బూర నర్సయ్యగౌడ్ ఈ ప్రాంతాన్ని ఎంతో అభివృద్ధి చేశారని తెలిపారు. మళ్లీ ఈ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ తుంగతుర్తి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కడియం రామచంద్రయ్య, కాపా రవికుమార్, జుట్టుకొండ సత్యనారాయణ, పగిళ్ల శంకర్, జిన్నె అశ్విన్, బైరబోయిన నాగయ్య, మారపాక రాములు, బుర్ర జనార్దన్, కూర శంకర్ పాల్గొన్నారు.

సీపీఎం అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలి

- సీపీఎం నేత జూలకంటి రంగారెడ్డి


రోడ్డుషోలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి, పక్కన ఎంపీ అభ్యర్థి జహంగీర్

నకిరేకల్: లోక్‌సభ ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం భువనగిరి సీపీఎం ఎంపీ అభ్యర్థి ఎండీ జహంగీర్‌ను గెలిపించాలని కోరుతూ నకిరేకల్ మండలంలోని కడపర్తి, ఓగోడు, నకిరేకల్, మంగళపల్లి, నోముల గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. తెలంగాణలోని 17ఎంపీ స్థానాల్లో ఒక భువనగిరి నుంచి మాత్రమే సీపీఎం బరిలో ఉందన్నారు. నకిరేకల్ నియోజకవర్గ అభివృద్ధి కోసం కమ్యూనిస్టు పార్టీ ఎనలేని కృషి చేసిందన్నారు. బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ఓటు వేయవద్దన్నారు. ఎంపీ అభ్యర్థి జహంగీర్ మాట్లాడుతూ.. గత మూడు దఫాలుగా ఎంపీగా గెలిచిన వారు భువనగిరికి చేసిందేమీ లేదన్నారు. ఈసారి తనను గెలిపించి పార్లమెంట్‌కు పంపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు కందాల ప్రమీల, మాజీ ఎంపీపీ మర్రి వెంకటయ్య, మండల, పట్టణ కార్యదర్శులు రాచకొండ వెంకట్‌గౌడ్, వంటిపాక వెంకటేశ్వర్లు, నాయకులు యానాల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నగదు, మద్యం పట్టివేత

చిట్యాల : మండలంలోని వట్టిమర్తి గ్రామశివారులో జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో మండల పోలీసులు మంగళవారం వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ఓ వ్యక్తి నుంచి ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.లక్ష 40వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు మండల పోలీసులు తెలిపారు. పట్టుబడిన నగదును జిల్లా ట్రెజరీ అధికారులకు అప్పగించినట్లు వెల్లడించారు.

తిప్పర్తిలో రూ.89వేలు..

రామగిరి(నల్లగొండ) : యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు మండలం కూరెళ్ల గ్రామానికి చెందిన హనుమంతుల సత్తయ్య మిర్యాలగూడ నుంచి నల్లగొండ వైపు వెళ్తుండగా తిప్పర్తి మండల కేంద్రంలో పోలీసులు అతడి వద్ద రూ.89వేలు స్వాధీనం చేసుకున్నారు. ఆ నగదును ట్రెజరీకి అప్పగించారు.

మర్రిగూడలో మద్యం..

మర్రిగూడ : మండలంలోని తిరగండ్లపల్లి గ్రామానికి చెందిన కిరాణదుకాణం నిర్వాహకుడు మంగళగిరి బాలాజీ అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. దాడుల్లో 63ఓసీ 90ఎంఎల్, ఐదు ఐబీ క్వాటర్ బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రంగారెడ్డి తెలిపారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

- మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

మర్రిగూడ: అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. మర్రిగూడ మండల కేంద్రంలోని భారతి గార్డెన్‌లో మర్రిగూడ, నాంపల్లి మండలాల బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని మంగళవారం భువనగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్‌తో అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతులకు కన్నీళ్లు మిగిల్చారు తప్ప వారి కష్టాలను తీర్చలేదని ఆరోపించారు. తెలంగాణ అభివృద్ధి చెందింది కేసీఆర్‌తోనేనని, రాష్ట్ర ప్రజలు కేసీఆర్ పాలననే కోరుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, పల్లె రవికుమార్, పాల్వాయి స్రవంతి, ఇన్‌చార్జి ఎంపీపీ కట్కూరి వెంకటేష్‌గౌడ్, మాజీ ఎంపీపీలు పాల్గొన్నారు.

తెలంగాణకు శాశ్వత హీరో కేసీఆర్..


చండూరు: మాట్లాడుతున్న జగదీష్‌రెడ్డి

చండూరు: తెలంగాణకు శాశ్వత హీరో కేసీఆర్ అని, బీఆర్ఎస్‌ను వీడే వారితో పార్టీకి ఎలాంటి నష్టం లేదని మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. చండూరులో మంగళవారం నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్ మాట్లాడుతూ.. కోమటిరెడ్డి బ్రదర్స్ తనకంటే గొప్ప ఏమీ కాదని అన్నారు. భువనగిరిలో బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమన్నారు. మాజీ ఎమ్మెల్యేలు కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్, చండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ తోకల చంద్రకళ, సూర్యాపేట మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటనారాయణగౌడ్, రాష్ట్ర నాయకురాలు పాల్వాయి స్రవంతిరెడ్డి, మునగాల నారాయణరావు, గుర్రం వెంకటరెడ్డి, జెడ్పీటీసీ కర్నాటి వెంకటేశం, ఎంపీపీ అవ్వారి గీత తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తాపడి విద్యార్థి మృతి


కడారి ప్రణీత్ (ఫైల్)

శాలిగౌరారం: ట్రాక్టర్ బోల్తాపడి విద్యార్థి మృతిచెందాడు. ఈ ఘటన శాలిగౌరారం మండలంలోని తుడిమిడి గ్రామంలో మంగళవారం జరిగింది. వివరాలు.. యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం మానాయికుంట గ్రామానికి చెందిన కడారి శ్రీను కుమారుడు కడారి ప్రణీత్(15) హైదరాబాద్‌లోని హయాత్‌నగర్‌లో గల ప్రభుత్వ గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలలో తొమ్మిదో తరగతి పూర్తి చేశాడు. ప్రస్తుతం వేసవి సెలవులు ఉండడంతో ఇటీవలే మానాయికుంటకు వచ్చాడు. మానాయికుంట గ్రామంలో మే నెల మూడో వారంలో గంగదేవమ్మ పండుగ ఉండడంతో గ్రామానికి చెందిన కొందరు ట్రాక్టర్ల సహాయంతో శాలిగౌరారం మండలం తుడిమిడి గ్రామానికి చెందిన ఓ రైతు వ్యవసాయ క్షేత్రం నుంచి దేవాలయం వద్దకు మట్టి తరలిస్తున్నారు. శ్రీను కూడా మట్టి తోలేందుకు తన ట్రాక్టర్‌ను మంగళవారం డ్రైవర్‌కు ఇచ్చి పంపించాడు. కొన్ని ట్రిప్పులు కొట్టిన తర్వాత మధ్యాహ్నం మానాయికుంటకు వచ్చిన ట్రాక్టర్ డ్రైవర్ భోజనం చేసేందుకు వెళ్లాడు. డ్రైవర్ భోజనం చేసే లోపు ఒక్క ట్రిప్పు తోలేందుకని ప్రణీత్ ట్రాక్టర్‌ను తీసుకెళ్లాడు. ఈ క్రమంలో మట్టి లోడు కోసం వెళ్తుండగా తుడిమిడి గ్రామ సమీపంలో మూలమలుపు వద్ద ట్రాక్టర్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న గోతిలోకి దూసుకెళ్లి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో ప్రణీత్ ట్రాక్టర్ పైనుంచి పడి అక్కడికక్కడే మృతిచెందాడు. మానాయికుంటకు చెందిన ఓ ట్రాక్టర్ డ్రైవర్ గమనించి దగ్గరకు వెళ్లి చూడగా.. అప్పటికే ప్రణీత్ మృతిచెందాడు. స్థానికులు జేసీబీ సహాయంతో ట్రాక్టర్‌ను గోతిలో నుంచి బయటకు లాగి ప్రణీత్ మృతదేహాన్ని బయటకు తీశారు.

ప్రియుడితో కలిసి భర్తను కడతేర్చిన భార్య

- బొల్లిగుట్టతండాలో ఘటన


నాకా మృతదేహం

మిర్యాలగూడ: వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని భార్య తన భర్తను ప్రియుడితో కలిసి దారుణంగా హత్య చేసింది. ఈ ఘటన దామరచర్ల మండలంలోని బొల్లిగుట్టతండాలో సోమవారం అర్ధరాత్రి జరిగింది. ఎస్ఐ రవి తెలిపిన వివరాల ప్రకారం.. బొల్లిగుట్టతండా గ్రామానికి చెందిన లావూరి నాకా (50) భార్య 20 ఏళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందగా.. ఆమె చెల్లెలు పుల్లిని ఇచ్చి పెద్దలు వివాహం చేశారు. వారికి ఒక కుమారుడు ఉన్నాడు. అదే గ్రామానికి చెందిన లావూరి రమేష్‌తో పుల్లి వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో నాకా పలుమార్లు పుల్లిని హెచ్చరించాడు. దీంతో తన వివాహేతర సంబంధానికి అడ్డువస్తున్నాడనే కారణంతో నాకాను ప్రియుడు రమేష్‌తో కలిసి హతమార్చాలను పన్నాగం పన్నింది. సోమవారం రాత్రి ఇంటికి వచ్చిన నాకాను పుల్లి మాయమాటలు చెప్పి ఇంటి సమీపంలోకి తీసుకెళ్లగా.. అక్కడే ఉన్న ప్రియుడు రమేష్‌తో కలిసి నాకా గొంతును వైరుతో నులిమి హత్య చేశారు. మరుసటి రోజు మంగళవారం నాకా మొదటి భార్య కుమారుడు నెహ్రూ తన తండ్రి మృతిచెంది ఉండడాన్ని గమనించి స్థానికులకు విషయం తెలియజేశాడు. నాకాను హత్య చేసినట్లు గుర్తించి వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. తన తండ్రిని పుల్లితో పాటు ఆమె ప్రియుడు రమేష్ హత్య చేశారని నెహ్రూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నాకా మృతదేహాన్ని పోస్టుమార్టంకు పంపించి అనంతరం బంధువులకు అప్పగించారు. నెహ్రూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పది ఫలితాల్లో ‘జయ’ ప్రభంజనం


10జీపీఏ సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

- 73మంది విద్యార్థులకు 10జీపీఏ

సూర్యాపేటటౌన్ : పదోతరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో సూర్యాపేట పట్టణంలోని జయ పాఠశాలకు చెందిన పదోతరగతి విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. 386మంది విద్యార్థులకు గాను 73మంది విద్యార్థులు 10జీపీఏ సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్ మంగళవారం తెలిపారు. అలాగే 64మంది విద్యార్థులు 9.8జీపీఏ, 57 మంది 9.7జీపీఏ, 46మంది 9.5జీపీఏ సాధించినట్లు వెల్లడించారు. అలాగే 333మంది విద్యార్థులు 9జీపీఏ పైగా సాధించారన్నారు. పరీక్షలకు హాజరైన విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్‌తో పాటు డైరెక్టర్లు బింగి జ్యోతి, జెల్లా పద్మ అభినందించారు.

ప్రజలకు సేవలందించడం అభినందనీయం

- ఎస్పీ రాహుల్ హెగ్డే


ఉద్యోగ విరమణ పొందిన ఎస్ఐ ఇబ్రహీంను సన్మానిస్తున్న ఎస్పీ

సూర్యాపేట : సుదీర్ఘకాలం పోలీసు శాఖలో పనిచేస్తూ ప్రజలకు సేవలు అందించడం అభినందనీయమని ఎస్పీ రాహుల్‌హెగ్డే అన్నారు. మంగళవారం ఎస్ఐగా ఉద్యోగ విరమణ పొందుతున్న ఇబ్రహీం దంపతులను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఇబ్రహీం పోలీసు శాఖలో 40సంవత్సరాలుగా సేవలందించడం గొప్ప విషయమన్నారు. పోలీసులు త్యాగాలు చేయడంతోనే నేటి సమాజం శాంతియుతంగా ఉందన్నారు. కార్యక్రమంలో పోలీసు సంక్షేమ సంఘం అధ్యక్షుడు రామచందర్‌గౌడ్, వీరరాఘవులు, అంజన్‌రెడ్డి, వెంకన్న, వెంకయ్య పాల్గొన్నారు.

నేటి నుంచి భువనగిరిలో టెన్నిస్ పోటీలు

భువనగిరి : పట్టణం మరో జాతీయ స్థాయి క్రీడా పోటీలకు వేదికకానుంది. పట్టణంలోని న్యూ డైమెన్షన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఏప్రిల్ 29, 30తేదీల్లో టెన్నిస్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులకు ఈనెల 1నుంచి 4వ తేదీ వరకు పోటీలు నిర్వహించనున్నారు. మొదటి రోజు ప్రీ క్వార్టర్, క్వార్టర్స్, సెమీఫైనల్‌తో పాటు ఫైనల్ పోటీలు నిర్వహించనున్నారు. ఇందుకోసం నిర్వాహకులు మంగళవారం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

వివిధ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు..

జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలకు దేశంలోని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, తమిళనాడు, పశ్చిమబెంగాల్, గుజరాత్, మధ్యప్రదేశ్, ఒడిశా, ఢిల్లీ, పంజాబ్ తదితర రాష్ట్రాల నుంచి మొత్తం 143 మంది క్రీడాకారులు వచ్చారు. అండర్–14 బాలబాలికల విభాగం కావడంతో ఇదే పాఠశాలలో క్రీడాకారులకు వసతి కల్పించారు.

యువకుడి బలవన్మరణం

రాజాపేట : ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండంలోని నెమిల గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గవ్వల బాలయ్య జయమ్మకు ఇద్దరు కుమారులు. వారి చిన్న కుమారుడు భాను కొన్ని నెలలుగా హైదరాబాద్‌లో ఎలక్ట్రీషన్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం దమ్మాయిగుడలోని బంధువుల ఇంట్లో జరిగిన పండుగకు హాజరై మరుసటి రోజున తన స్వగ్రామం నెమిలకు వచ్చాడు. ఆర్థిక ఇబ్బందులు అధికమవ్వడంతో మనస్థాపానికి గురైన తన వ్యవసాయ బావివద్ద ఉన్న ఓ చెట్టుకు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఉదయం అటుగా వెళ్లిన సమీప రైతు గమనించి గ్రామస్తులకు సమాచారం ఇచ్చాడు. గ్రామస్తులు విషయాన్ని పోలీసులకు తెలియజేయడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో గడ్డివాము, గుడిసె దగ్ధం

అర్వపల్లి : షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు లేచి గడ్డివాము, ఇతర సామగ్రి కాలి బూడిదయ్యాయి. ఈ ఘటన మండలంలోని తిమ్మాపురం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. బాధిత రైతు శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామశివారులో ఉన్న సార్ల శ్రీనివాస్ అనే రైతు వ్యవసాయ క్షేత్రం వద్ద విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరిగి 200మోపుల గడ్డివాము, 150కిలోల ప్లాస్టిక్ పైపు, 25పీవీసీ పైపులు, పశువుల కొట్టం, ఇతర సామగ్రి అగ్నికి ఆహుతయ్యాయి. ఈ సమయంలో కొట్టంలో ఉన్న పశువులు మేతకు వెళ్లడంతో ప్రమాదం తప్పింది. సుమారు రూ.60వేల నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతు శ్రీనివాస్ వాపోయాడు.

ముగిసిన రాష్ట్ర స్థాయి ఎడ్ల పందేలు

- రెండు రాష్ట్రాల స్థాయి ప్రథమ విజేత గుంటూరు జిల్లా గిత్తలు


బహుమతులు పంపిణీ చేస్తున్న ఫాదర్లు, సిస్టర్లు, నిర్వాహకులు

మఠంపల్లి : మండల కేంద్రంలోని శుభవార్త చర్చి తిరనాళ్లను పురస్కరించుకుని శుభోదయ యువజన సంఘం ఆధ్వర్యంలో స్థానికంగా నిర్వహించిన రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్ల పందేలు ఫైనల్ పోటీలు సీనియర్స్ విభాగంలో సోమవారం నాలుగో రోజు ఫ్లడ్‌లైట్ల వెలుతురులో అర్ధరాత్రి ముగిశాయి. ఈ పోటీల్లో గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కుంచనపల్లికి చెందిన పులగం త్రిషగ్నారెడ్డి, జశ్వంతారెడ్డిల గిత్తలు ప్రథమ స్థానంలో గెలుపొంది రూ.1లక్షా 50వేలు నగదు బహుమతిని కైవసం చేసుకున్నాయి.అదే విధంగా రెండో బహుమతిని గుంటూరు జిల్లా పెదకాకాని మండలం కొప్పురావూరుకు చెందిన తోట శ్రీనివాసరావు గిత్తలు గెలుపొంది రూ.1లక్ష నగదు బహుమతిని పొందారు. మూడో బహుమతి కృష్ణా జిల్లా ఘంటసాలకు చెందిన మేకా కృష్ణమోహన్ గిత్తలు, పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం ఇనిమెట్లకు చెందిన కటకం వెంకటేశ్వరరావు గిత్తలు సంయుక్తంగా గెలుపొంది రూ.60వేల నగదు కైవసం చేసుకున్నారు. నాలుగో బహుమతి గుంటూరు జిల్లా పెదకాకానికి చెందిన టి.శ్రీనివాసరావు గిత్తలు గెలుపొంది రూ.40వేలు నగదు అందుకున్నారు. ఐదో బహుమతి విజయవాడకు చెందిన ఎం.క్రిష్ణమోహన్ గిత్తలు గెలుపొంది రూ.25వేలు నగదు కైవసం చేసుకున్నారు. విజేతలకు నగదుతో పాటు మెమోంటోలు అందజేశారు. ఈ బహుమతుల ప్రదానంలో చర్చి పాదర్లు, సిస్టర్లు, బ్రదర్లు, చర్చి కమిటీ, శుభోదయ యువజన సంఘం సభ్యులు అందజేశారు. అనంతరం దాతలను మెమెంటోలు, శాలువాలతో సన్మానించారు. కృష్ణాజిల్లా పెనుమత్సకు చెందిన రాధాకృష్ణ అంపైర్, వ్యాఖ్యాతగా వ్యవహరించారు. కార్యక్రమంలో పాదర్‌లు మార్టిన్ పసల, అల్లం బాలరెడ్డి, బ్రదర్ వినోద్‌రెడ్డి, సిస్టర్‌లు సుజాతమ్మ, రూబిన్, శుభోదయ యువజన సంఘం అధ్యక్షుడు గాదె జయభారత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఆదూరి స్రవంతి కిషోర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, లూర్దుమారెడ్డి, బాలరెడ్డి, గాలి చిన్నపురెడ్డి, బోయపాటి అంతోనిరెడ్డి, టీఆర్ బాలశౌరెడ్డి, గోపు ఆనందరెడ్డి, విక్టర్‌రెడ్డి, లూర్ధురెడ్డి, ఆదూరి శౌరెడ్డి, జార్జిరెడ్డి, బాలరెడ్డి, శుభోదయ సభ్యులు కొమ్మారెడ్డి రంజిత్‌రెడ్డి, గోపు అఖిల్‌రెడ్డి, గాదె మనీస్‌రెడ్డి, గాదె పవన్‌రెడ్డి పాల్గొన్నారు.